దివ్వెల పండుగకు సర్వం సిద్ధం


నిడమర్రు రోడ్డులో కోలాహలంగా బాణసంచా దుకాణాలు


దుకాణాలలో విక్రయానికి సిద్ధంగా ఉన్న బాణసంచా

- బాణసంచా కొనుగోలు చేసి పండుగ వేడుకలకు సిద్ధమైన నగరవాసులు
- హరిత దీపావళి జరుపుకోవాలంటున్న నిపుణులు

మంగళగిరి: దీపావళి పండుగను ఉత్సాహంగా ఉల్లాసంగా జరుపుకొనేందుకు నగర ప్రజలు సన్నాహాలు చేసుకుంటున్నారు. దీంతో నగరంలోని పలు చోట్ల బాణసంచా దుకాణాలు వెలవగా బాణసంచా కొనుగోలును ప్రజలు ప్రారంభించారు. ఆదివారం దీపావళి పండుగ కాగా ఈ ఏడాది శని, ఆదివారాలతో పాటు సోమవారం ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో పాటు మూడు రోజులు పండుగ వాతావరణం నెలకొంది. శనివారం సెలవు కావడంతో చిన్నారులు ఉదయం నుంచే టపాసులు కొనుగోలు చేస్తున్నారు. నగరంలో పలు చోట్ల దుకాణాలు వెలవగా దుకాణాల వద్ద జనం తాకిడితో కోలాహలం నెలకొంది. మంగళగిరి పట్టణంలో ప్రధానంగా నిడమర్రు రోడ్డులో ఖాళీ మైదానంలో దుకాణాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా నగరంలోని ఆటోనగర్ గౌతమ బుద్ధారోడ్డు వెంట, జాతీయ రహదారి, తాడేపల్లిలో ఉండవల్లి సెంటర్, గుడ్ న్యూస్ స్కూలుతో పాటు ఆయా ప్రధాన కూడళ్లలో బాణసంచా దుకాణాలు వెలిశాయి. ఆదివారం పండుగ కావడంతో పాటు సోమవారం కూడా పండుగ ఉంటుందని వేదపండితులు వెల్లడించడం, సోమవారం ప్రభుత్వం సెలవు ప్రకటించడంతో మూడు రోజుల పాటు పండుగ వాతావరణం నెలకొననుంది. ఇప్పటికే హాస్టల్‌లో వుంటున్న విద్యార్థులు, దూరప్రాంతాలలో ఉంటున్న కుటుంబసభ్యులు, బంధువుల రాకతో నగరంలో పండుగ వాతావరణం నెలకొంది.

క్లుప్తంగా

ఎమ్మెల్యే ఆర్కే దీపావళి శుభాకాంక్షలు



మంగళగిరి: నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) దీపావళి శుభాకాంక్షలు తెలియజేశారు. శనివారం నగరంలో ఆటోనగర్‌లోని ఎమ్మెల్యే ఆర్కే కార్యాలయం ఈమేరకు ప్రకటన విడుదల చేసింది. చెడుపై మంచి సాధించిన విజయానికి ప్రతీక అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్ర ప్రజల జీవితాలలో వెలుగులు నింపగా ఈ ఏడాది మరిన్ని వెలుగులతో ప్రజలు సుఖసంతోషాలతో అష్టఐశ్వర్యాలతో జీవించాలని ఆకాంక్షించారు. దీపావళిని ఆదర్శంగా తీసుకుని ప్రజలు తమ మనస్సులలోని చెడును వీడి మంచివైపు పయనించి తమ జీవితాలలో వెలుగులు నింపుకోవాలని కోరారు. దేవుడి ఆశీస్సులతో ప్రజలు రానున్న రోజులలో మరింత సుఖసంతోషాలతో అష్టఐశ్వరాలతో జీవించాలని ఆకాంక్షించారు.

చంద్రమోహన్ మృతిపై ప్రగాఢ సంతాపం

తాడేపల్లిరూరల్: సినీ నటుడు చంద్రమోహన్ ఆకస్మిక మృతి పట్ల తోటి సినీ నటులు శనివారం సంతాపం తెలియజేశారు. ఉండవల్లి సెంటర్‌లో నివాసముండే దర్శకుడు, నటుడు గాదె నాగభూషణం చంద్రమోహన్ మృతి సినీ పరిశ్రమకు తీరని లోటలని, ఎంతోమందికి ఆదర్శప్రాయంగా నిలిచి చిన్నా, పెద్ద వారిని ఆప్యాయంగా పలకరించే చంద్రమోహన్ అనారోగ్యంతో మృతి చెందడం చాలా బాధకరమని, ఆయనతో కలసి నేను లచ్చి అనే సినిమాలో నటించానని, ఒక్క సినిమా ఆయనతో కలసి చేయడంతో ఎక్కడ కనిపించినా ఆప్యాయంగా పలకరించేవారని నాగభూషణం అన్నారు.

యూటీఎఫ్ దుగ్గిరాల నూతన కమిటీ


జి.మారుతీ గోపీనాథ్, బి.చలపతిరావు

తాడేపల్లిరూరల్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) దుగ్గిరాల మండల నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. రాష్ట్ర శాఖ సహాధ్యక్షురాలు కె. నాగకుసుమ కుమారి, జిల్లా శాఖ కోశాధికారి మహమ్మద్ గయాసుద్దొలాల ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. మండల కమిటి గౌరవ అధ్యక్షురాలుగా కె. కామాక్షి, అధ్యక్షులుగా జి. మారుతీ గోపీనాథ్, సహాధ్యక్షులుగా జి. విజయలక్ష్మి, ఆర్.విశ్వేశ్వర ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా బి.చలపతిరావు, కోశాధికారిగా షేక్ మహమ్మద్ హుస్సేన్ మరియు 9 మంది కార్యదర్శులు, 8 మంది జిల్లా మహా సభ ప్రతినిధులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారని గయాసుద్దొలా తెలియజేశారు.

చిన్నారులకు పౌష్టికాహారం కిట్ల పంపిణీ

గుంటూరు మెడికల్: స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు వచ్చి చిన్నారులకు పౌష్టికాహారం, భోజన సదుపాయం కల్పించడం అభినందనీయమని గుంటూరు జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రి శుశ్రుత హాలులో శనివారం ప్రాణాంతకమైన వ్యాధికి గురైన చిన్నారులకు, తల్లిదండ్రులకు పౌష్టికాహారం కిట్లను ఏఆర్‌టీ సెంటర్ ఆధ్వర్యంలో ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ సమాజ సేవ చేయడం కూడా అదృష్టంగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో డెప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీనివాస ప్రసాద్, డాక్టర్ రవి, సత్యనారాయణ, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ప్రజారక్షణ భేరి సభను జయప్రదం చేయాలి

పెదకాకాని: విజయవాడలో ఈనెల 15న నిర్వహించనున్న ప్రజారక్షణ భేరి సభలో ప్రజలు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి వై. నేతాజీ కోరారు. పెదకాకానిలో శనివారం ప్రచార జాతాను ప్రారంభించారు. ఈ సందర్భంగా నేతాజీ మాట్లాడుతూ ఏపీకి ప్రత్యేక హోదా, విభజన హామీలు, విశాఖ ఉక్కు, వెనుకబడిన జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, అందరికీ నాణ్యమైన ఉచిత విద్య, వైద్యం, మంచినీరు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు.

ముగిసిన సామాజిక విజ్ఞాన కళాశాల సేవా శిబిరం


బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ మాదాసు రత్నకుమారి, ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నిడుముక్కల (తాడికొండ): సేవాభావంతో ముందుకు వెళితే జీవితంలో ఉన్నతంగా ఎదగవచ్చని నిడుముక్కల గ్రామ సర్పంచ్ మాదాసు రత్నకుమారి అన్నారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం సామాజిక విజ్ఞాన కళాశాల ఆధ్వర్యంలో జాతీయ సేవా పథకంలో భాగంగా దత్తత గ్రామమైన నిడుముక్కలలో వారం రోజులపాటు నిర్వహించిన సేవా శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈసందర్భంగా విద్యార్థులు గ్రామంలో నిర్వహించిన వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను పలువురు అభినందించారు. చదువుతో పాటు, సామాజిక స్పృహను పెంచే ఇలాంటి కార్యక్రమాలు విద్యార్థులకు తెలియజేయడం వల్ల వారికి జీవితంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ఈసందర్భంగా ఎన్ఎస్ఎస్ వలంటీర్లకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు సర్పంచ్ రత్నకుమారి, కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ చైతన్య కుమారి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు ఎన్ఎస్ఎస్ వలంటీర్లు, విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

మార్నింగ్ స్టార్ అధ్యాపక, విద్యార్థినికి ఉత్తమ అవార్డులు


ఉప ముఖ్యమంత్రి చేతుల మీదుగా అవార్డులు అందుకుంటున్న దృశ్యం

ఫిరంగిపురం: ఉర్దూలో ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను స్థానిక మార్నింగ్ స్టార్ కళాశాల అధ్యాపకుడు అందుకున్నారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని పురస్కరించుకొని జాతీయ విద్యాదినోత్సవంగా జరుపుకొంటున్న సందర్భంగా విజయవాడలో శనివారం ఇందిరాగాంధీ స్టేడియంలో మైనార్టీ డే కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఫిరంగిపురం మార్నింగ్‌స్టార్ కళాశాలకు చెందిన ఉర్దూ అధ్యాపకుడు పీర్ల మహమ్మద్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు, ఉత్తమ విద్యార్థిగా షేక్ షహీదా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి అంజాద్ బాషా అవార్డులు అందజేశారు. ఈసందర్భంగా కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కరస్పాండెంట్, రాష్ట్ర ప్రభుత్వ క్రిస్టియన్ మైనార్టీ సలహాదారుడు ఎం.బాలస్వామి వారిని అభినందించారు. ప్రిన్సిపాల్ హరినాథరెడ్డి, అధ్యాపకులు సునీల్‌కుమార్, షేక్ మస్తాన్‌వలి పాల్గొన్నారు.

చిరస్మరణీయుడు మౌలానా అబుల్ కలాం ఆజాద్


మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న షేక్ సుభాని

తాడేపల్లిరూరల్: స్వాతంత్ర్య సమరయోధుడు, భారతదేశ మొట్టమొదటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతి వేడుకలను శనివారం దుగ్గిరాలలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మౌలానా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభాని మాట్లాడుతూ మౌలానా అబుల్ కలాం ఆజాద్ స్వాతంత్ర్య పోరాటంలో 10 సంవత్సరాలు జైలు జీవితం గడిపారని, బ్రిటిష్ వారి దాష్టీకాన్ని ఎదిరించి పోరాడిన ధీరుడని అన్నారు. స్వతంత్ర్య భారతదేశానికి తొలి విద్యాశాఖ మంత్రిగా 11 సంవత్సరాలు పనిచేసి అనేక సంస్కరణలు అమలు చేసి విద్యారంగానికి ఎనలేని సేవలు చేశారని కొనియాడారు. ఆయన స్ఫూర్తితో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో విద్యకు పెద్దపీట వేస్తున్నారన్నారు. షేక్ కరిముల్లా, షేక్ జానీ, షేక్ రషీద్, షేక్ హుస్సేన్, షేక్ జాన్ సైదా, సయ్యద్ జలీల్, పఠాన్ మస్తాన్, పెద్దేటి యోహాను తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఫౌండ్రీ కార్మికుడు మృతి



మంగళగిరి: రోడ్డు ప్రమాదంలో ఫౌండ్రీ కార్మికుడు మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. శనివారం పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు నగర పరిధిలోని యర్రబాలెంకు చెందిన ఎస్‌కే మస్తాన్(35) మంగళగిరిలో ఫౌండ్రీ కార్మికుడుగా విధులు నిర్వహిస్తుంటాడు. శనివారం మధ్యాహ్నం మంగళగిరి నుంచి యర్రబాలెం ద్విచక్రవాహనంపై వెళ్తుండగా ఎయిమ్స్ వద్ద గల ఫ్లైఓవర్ వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న కోళ్ల వ్యాన్ వేగంగా వచ్చి ఢీకొట్టడంతో వాహనంపై నుంచి కిందపడ్డ మస్తాన్ రోడ్డుపై పడి తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ప్రమాద వివరాలు సేకరించి మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ప్రస్తుతం నవులూరు టిడ్కో ఇళ్లల్లో నివాసముంటున్న మస్తాన్‌కు భార్య, ఇద్దరు పిల్లలు కలరు.

14 నుంచి గ్రంథాలయ వారోత్సవాలు


వారోత్సవాల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సర్పంచి స్వరూపరాణి తదితరులు

పెదకాకాని: విద్యార్థులు, యువత గ్రంథాలయ వారోత్సవాల్ని సద్వినియోగం చేసుకోవాలని సర్పంచి గోళ్ల స్వరూపరాణి తెలిపారు. పెదకాకాని గ్రంథాలయంలో శనివారం 56వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు పురస్కరించుకుని వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా స్వరూపరాణి మాట్లాడుతూ వారోత్సవాల సందర్భంగా నిర్వహించే కార్యక్రమాల్లో విద్యార్థులు, యువత పాల్గొనడం ద్వారా జనరల్ నాలెడ్జ్‌పై అవగాహన పెరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం ఈనెల 14 నుంచి 20 వరకు నిర్వహించే వారోత్సవాలలో పెద్దఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. గ్రంథాలయాధికారి వేముల విజయ్‌కుమార్ మాట్లాడుతూ వారం రోజుల పాటు బాలల దినోత్సవం, దేశభక్తి గేయాల పోటీలు, పుస్తక ప్రదర్శన, కథలు చెప్పడం, పద్య పఠనం, గ్రంథాలయ ఉద్యమ ప్రముఖులు ఎస్సార్ రంగనాథన్, అయ్యంకి వెంకట రమణయ్య, పాతూరి నాగభూషణం వంటి వారిని స్మరించుకోవడం, వ్యాస రచన పోటీలు, కవి సమ్మేళనాలు, సెమినార్లు, రచయితల సందేశాలు, చిత్రలేఖనం పోటీలు, పుస్తక ప్రదర్శన, డిబేట్ పోటీలు, మహిళా దినోత్సవం, దిశా చట్టం, మహిళ సాధికారతపై చర్చ, క్రీడా పోటీల నిర్వహణతో పాటు డిజిటల్ గ్రంథాలయాలు, చదవటం మాకిష్టం కార్యక్రమంపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు. చివరి రోజు 20వ తేదీన విజేతలకు బహుమతుల ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక పెద్దలు, విద్యార్థులు పాల్గొన్నారు.

'ఎన్ఆర్ఐ'లో జాతీయ విద్యా దినోత్సవం



మేడికొండూరు: భారత తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్‌కలాం అజాద్ జయంతి సందర్భంగా శనివారం జాతీయ విద్యా దినోత్సవం విశదల ఎన్ఆర్ఐ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో ఘనంగా జరిపారు. కళాశాల ప్రిన్సిపాల్ కోటా శ్రీనివాసరావు మాట్లాడుతూ 11 ఏళ్లు విద్యా శాఖ మంత్రిగా పనిచేసి భారతదేశంలో విద్యారంగ అభివృద్ధికి ఎంతో కృషి చేసిన మౌలానా అబుల్ కలాం అజాద్ సేవలను గుర్తుచేశారు. అజాద్ జయంతిని జాతీయ విద్యా దినోత్సవంగా జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు. మౌలానా అబుల్ కలాం అజాద్ చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో పలు విభాగాల అధిపతులు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

ఫిరంగిపురం: తమ చుట్టూ ఉన్న పరిసరాలు శుభ్రం చేయడం ద్వారానే ఆరోగ్యం చేకూరుతుందని హెచ్ఎస్ కొండపల్లి సుదర్శన్ అన్నారు. మండలంలోని వేములూరిపాడులో కొండబజార్, బొడ్రాయి సెంటర్, ప్రధాన వీధిలో శనివారం కాలువలు పరిశీలించారు. పంచాయతీ సిబ్బందితో మురుగుకాలువలు బాగుచేయించారు. స్థానికులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఆరోగ్యసిబ్బంది బాబురావు, స్వప్న, ఆంథోనిరాణి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పంచారామాలు, శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు

తెనాలిఅర్బన్: కార్తికమాసాన్ని పురస్కరించుకుని పంచారామాలు, శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు ఆర్టీసీ తెనాలి డిపో మేనేజర్ ఎ.రాజశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. పంచారామాలైన సామర్లకోట, ద్రాక్షారామం, పాలకొల్లు, భీమవరం, అమరావతిలకు కార్తికమాసంలో ప్రతి శనివారం సాయంత్రం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు చెప్పారు. అలాగే శైవ క్షేత్రాలైన యాగాటి, మహానంది, శ్రీ శైలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు వివరించారు. అరుణాచలం, శ్రీ కాళహస్తి, కాణిపాకం, గోల్డెన్ టెంపులు, శబరిమలై వెళ్ళే అయ్యప్ప భక్తుల కోసం ప్రత్యేక బస్సు సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వివరాలకు తెనాలి ఆర్టీసీ డిపో ఫోన్ నెంబర్ 7382897598, 7382892492 లలో సంప్రదించాలని సూచించారు.

వృద్ధులకు పండ్లు పంపిణీ



తెనాలిటౌన్: బుర్రిపాలెం రోడ్డులోని మహాత్మ సేవా శాంతి ఆశ్రమం, నాజరుపేటలోని మన ఇల్లు వృద్ధాశ్రమంలో శనివారం శ్రీ విద్యాపీఠం నిర్వాహకులు పూజ్యశ్రీ బాలస్వామిజీ జన్మదినోత్సవ వేడుకలను శ్రీ వెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశ్రమాలలోని వృద్ధులకు పండ్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు. మహాత్మ ఆశ్రమంలో బాలస్వామిజీ వృద్ధులతో మాట్లాడి ప్రవచనం చేశారు. ఎస్వీయోగ కన్వీనర్ ఎం.రమణయ్య పర్యవేక్షణలో శ్రీ విద్యాపీఠంలో చంద్రమౌళేశ్వర స్వామికి 27కిలోల తేనెతో అభిషేకం చేశారు. ఆశ్రమాల నిర్వాహకులు వజ్రాల రామలింగాచారి, భారతి, మురళి, రమణయ్య, భక్తులు పాల్గొన్నారు.

29న మహా కుంభాభిషేకం

పొన్నూరు: పట్టణంలోని శ్రీ సుందరవల్లీ రాజ్యలక్ష్మీ సమేత శ్రీ సాక్షి భావనారాయణస్వామి అష్టబంధన మహా కుంభాభిషేకాన్ని ఈ నెల 27 నుంచి 29 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు ధర్మకర్తల మండలి సభ్యురాలు కిలారి లక్ష్మీ సరస్వతి తెలిపారు. ఆలయ ప్రాంగణంలో శనివారం కార్యక్రమాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా లక్ష్మీ సరస్వతి మాట్లాడుతూ 27న ఉదయం 9 గంటలకు విష్వక్సేన ఆరాధనతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. ప్రతిరోజు ప్రత్యేక పూజలు, హోమాలు జరుగుతాయన్నారు. 29న ఉదయం 9.05 గంటలకు మహా కుంభాభిషేకం జరుగుతుందని తెలిపారు. స్వామి, అమ్మవార్లను భక్తులు దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించాలని ఆమె కోరారు. సభ్యులు పల్లికల శ్యామ్, మండ్రు అనిత, అర్చకులు రఘునాథబాబు, పులిపాక ప్రసాద్, ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేషన్ వాహనాల భద్రతకు చర్యలు


సీతానగరం కార్పొరేషన్ షెడ్‌ను పరిశీలిస్తున్న ఎంటీఎంసీ కమిషనర్ నిర్మల కుమార్

తాడేపల్లిరూరల్: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలోని తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో కార్పొరేషన్ వాహనాలను భద్రపరిచేందుకు శనివారం కార్పొరేషన్ కమిషనర్ నిర్మల కుమార్ అధికారులతో కలసి షెడ్డును పరిశీలించారు. ఈ సందర్భంగా నిర్మల కుమార్ మాట్లాడుతూ తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో చెత్తసేకరించేందుకు, వాటిని డంపింగ్‌కు తరలించేందుకు సుమారు 40 వాహనాలు ఉన్నాయని, వాటిని ఆయా ప్రాంతాల్లో పార్క్ చేయడం వల్ల సమస్యలు ఏర్పడుతున్నాయని, వాటిని కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒకే చోట నిలపాలనే ఉద్దేశ్యంతో సీతానగరం కృష్ణాతీరంలో కార్పొరేషన్ షెడ్డును పరిశీలించామని త్వరలోనే అధికారికంగా నిర్ణయం తీసుకుని, చెత్త తరలించే వాహనాలను ఇక్కడనిలిపి వాచ్‌మెన్‌ను ఏర్పాటు చేయనున్నామని తెలిపారు. ఈ పరిశీలనలో కార్పొరేషన్ డీఈ కృష్ణారెడ్డి, ఏఈ కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

26న రజక ఆత్మగౌరవ సభ

జయప్రదం చేయాలని రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు అంజిబాబు వినతి


పోస్టర్‌ను ఆవిష్కరించిన అంజిబాబు, రజక సంఘాల నేతలు

తెనాలి: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం ఎదుట మైదానంలో ఈనెల 26వ తేదీన సాయంత్రం ఆరు గంటలకు తలపెట్టిన రజక ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని రజక సంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు పాతపాటి అంజిబాబు కోరారు. సభలో రజకుల సమస్యలపై చర్చించి, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలిపారు. స్థానిక ఎన్జీవో కళ్యాణమండపంలో శనివారం సన్నాహక సమావేశాన్ని నిర్వహించి, ఆత్మగౌరవ సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ జనాభా దామాషా ప్రకారం రజకులకు రాజకీయ ప్రాధాన్యత కల్పించాలని, రజకులకు రక్షణ చట్టం తీసుకురావాలనీ, రజకులను ఎస్సీ జాబితాలో చేర్చాలన్న డిమాండ్లతో తలపెట్టిన ఆత్మగౌరవ బహిరంగ సభకు రాష్ట్రవ్యాప్తంగా లక్షమంది హాజరుకానున్నట్లు చెప్పారు. అన్ని ప్రాంతాల్నుంచి రజక సోదరులు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు. ఆర్‌వీఎస్ అధ్యక్షుడు పోతార్లంక ప్రసాద్, కార్యదర్శి పి.శ్రీనివాస్, కౌన్సిలర్లు పెదలంక లక్ష్మీలావణ్య, వీర్లపాటి విజయలక్ష్మి, మార్కెట్‌యార్డు డైరెక్టర్ ధరణికోట నాగమల్లేశ్వరి, పెదలంక వెంకటేశ్వర్లు, మేడేపల్లి ప్రభాకర్ మాట్లాడారు. రజక సంఘ నాయకుడు మునిపల్లి వంశీ పర్యవేక్షించారు.

అలరించిన దీక్షిత్ కీర్తనలు


గానం చేస్తున్న శ్రీనివాస్ శర్మ

తెనాలి: రామలింగేశ్వరపేటలోని శ్రీ దుర్గా పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో శనివారం సాయంత్రం సంగీత సభ నిర్వహించారు. సంగీత జగద్గురు సేవా సమితి ఆధ్వర్యంలో సంగీత త్రిమూర్తులలో ఒకరైన శ్రీ ముత్తుస్వామి దీక్షిత్ వర్ధంతి సందర్భంగా సంగీత సాహిత్య ప్రవీణ, శృతివాగ్గేయ కళానిధి యనమండ్ర శ్రీనివాస్ శర్మచే శ్రీ ముత్తుస్వామి దీక్షిత్ గురించి సోదాహరణ ప్రసంగం తో కూడిన సంగీత కార్యక్రమం చక్కగా జరిగింది. శ్రీనివాస్ శర్మ ముత్తుస్వామి దీక్షిత్ వారి జీవిత చరిత్ర, వారు సంగీతానికి చేసిన సేవ గురించి విశేషంగా చెప్పారు. ముత్తుస్వామి దీక్షిత్ పలు సంగీత కీర్తనలు ఆలపించారు. వయోలిన్ పై చావలి శ్రీనివాస్, మృదంగంపై కానూరి వెంకట రామకృష్ణ వాద్య సహకారం అందించారు. అనంతరం సంగీత జగద్గురు సేవా సమితి తరపున డాక్టర్ చింతలపాటి మంజుల, యనమండ్ర శ్రీనివాస్ శర్మను ఘనంగా సత్కరించినారు. పర్చూరు సుబ్బారావు, కొండపి శ్రీనివాసరావు, ఎస్వీ చంద్రశేఖర్, నల్లూరు శ్రీనివాస్, తెనాలి సంగీత ప్రియులు, సంగీత గురువులు పాల్గొన్నారు. డాక్టర్ చింతలపాటి మంజుల పర్యవేక్షించారు.

నటుడు చంద్రమోహన్‌కు స్వరలయ నివాళి



తెనాలి: తెలుగు సినిమా పరిశ్రమలో 800 సినిమాల్లో ఎన్నో వైవిధ్యమైన పాత్రలకు జీవం పోసిన నటుడు చంద్రమోహన్ మరణం తెలుగు చిత్రసీమకు తీరని లోటని స్వరలయ వేదిక వ్యవస్థాపకుడు, రచయిత సాయి లక్కరాజు అన్నారు. సుప్రసిద్ధ నటుడు చంద్రమోహన్ సంతాపసభను శనివారం సాయంత్రం స్వరలయ వేదిక కార్యాలయంలో నిర్వహించారు. చంద్రమోహన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. గుంటూరు జిల్లా బాపట్లలో చంద్రమోహన్ అనేక నాటకాలు వేసినట్టు గుర్తుచేశారు. ఆయనతో తనకు కుటుంబ అనుబంధం ఉందన్నారు. శ్రీధర్, నటులు హేమంత్, శ్రీనివాస్, విశ్రాంత అధికారి రమణయ్య, బ్యాంక్ ఉద్యోగ సంఘ నేత రావిపాటి ప్రేమ్‌కుమార్ పాల్గొన్నారు.